# RTI Act: సమాచార హక్కు చట్టాన్ని నీరుగారుస్తున్నారా

అర్జున్ పర్మార్
బీబీసీ గుజరాతీ

15 జూన్ 2022




GETTY IMAGES

**''సామాన్య ప్రజలకు సాధికారత కల్పించేందుకు తీసుకొచ్చిన విప్లవాత్మక చట్టాల్లో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ)-2005 కూడా ఒకటి. తమ హక్కులను కాపాడుకునేందుకు చాలా మంది అణగారిన వర్గాల ప్రజలు దీన్ని ఆశ్రయిస్తున్నారు.''**

ఇవి నేషనల్ క్యాంపెయిన్ ఫర్ పీపుల్స్ రైట్ టు ఇన్ఫర్మేషన్ సంస్థ కో-కన్వీనర్ అంజలి భరద్వాజ్ మాటలు. ఈ చట్టం పట్ల తనంతో గర్వపడుతున్నట్లు ఆమె చెప్పారు. అదే సమయంలో ప్రభుత్వాలు, అధికారులు, రాజకీయ నాయకులు, న్యాయవ్యవస్థ దీన్ని నీరుగారుస్తున్నారని ఆమె అసంతృప్తి వ్యక్తంచేశారు.

చట్టానికి అనవసర సవరణలు చేయడం, సమాచార కమిషనర్లను నియమించడంలో ఆలస్యం, ఆర్‌టీఐ దరఖాస్తుదారులపై దాడులు తదితర చర్యలతో ఈ చట్టం బలహీనం అవుతోందని అంజలి చెబుతున్నారు.




## ఏడాదికి 60 లక్షలు..

2005 జూన్ 15న భారత రాష్ట్రపతి సమాచార హక్కు బిల్లుకు ఆమోద ముద్ర వేయడంతో ఇది చట్ట రూపం దాల్చింది.

గత 17ఏళ్లుగా ప్రభుత్వంలోని భిన్న స్థాయిల్లో అవినీతి, అవకతవకలను ఈ చట్టం వెలుగులోకి తీసుకొచ్చింది. మరోవైపు అధికారంలో ఉన్నవారిని జవాబుదారీతనానికి బాధ్యులను చేయడంలోనూ ఇది తోడ్పడింది.

సామాన్య పౌరులకు సాధికారత కల్పించడంలో ఈ చట్టం ప్రధాన పాత్ర పోషించింది. పంచాయతీల నుంచి మంత్రిత్వ శాఖల వరకు భిన్న స్థాయిల్లో అవినీతిని ఇది బయటపెట్టింది.

ప్రస్తుతం ఏడాదికి 60 లక్షల వరకు ఆర్‌టీఐ దరఖాస్తులు వస్తున్నాయి. వీటిలో చాలావరకు సమాచార హక్కు చట్టం ఉద్యమకారులు, సామాజిక కార్యకర్తలు దాఖలు చేస్తున్నారు. ముఖ్యంగా ఆహార భద్రత, ఉపాధి కల్పన లాంటి హక్కుల పరిరక్షణ కోసం దీన్ని ఉపయోగిస్తున్నారు.

మరోవైపు సుప్రీం కోర్టు కూడా ప్రజల సమాచార హక్కుకు మద్దతు పలికింది. సమాచార హక్కును భావప్రకటన స్వేచ్ఛలో భాగంగా గుర్తిస్తున్నట్లు పేర్కొంది. అయితే, గత కొన్ని ఏళ్లుగా ఈ హక్కును పొందడంలో చాలా అవాంతరాలు ఎదురవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

ఆర్‌టీఐ చట్టాన్ని ప్రభుత్వం నీరుగారుస్తోందనే ఆరోపణలపై భారత ప్రభుత్వంలోని సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ, సమాచార కమిషనర్లను మేం సంప్రదించాం. అయితే, ఈ వార్త రాసే సమయానికి మాకు ఎలాంటి స్పందనా రాలేదు.

అయితే, ఈ చట్టాన్ని ఎలా నీరుగారుస్తున్నారనే ప్రశ్నపై క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న నిపుణులతో బీబీసీ మాట్లాడింది.